నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 17 డిసెంబర్ 2024 | MEDAK

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

అసెంబ్లీలో లేవనెత్తిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 16: పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సోమవారం అసెంబ్లీలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జనగామ నియోజకవర్గంలో బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో స్పీకర్‌తో పాటు సంబంధిత శాఖ మంత్రి సీతక్క దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. పంచాయతీ రాజ్ శాఖను బలోపేతం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని సీఎం, మంత్రులు చెప్పుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 2023లో అనేకమంది సర్పంచ్‌లను హైదరాబాద్‌కు తీసుకొచ్చి మొత్తం సమస్యలు పరిష్కరించేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. కానీ సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జనగామ నియోజకవర్గంలోని 8 మండలాల్లోని 127 గ్రామాల్లో ప్రతి సర్పంచ్‌కు దాదాపుగా రూ.45 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 12 నెలలు దాటినా ఒక్క రూపాయి రాలేదు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని చిన్నరాంచర్ల, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు బిడ్డల పెండ్లిండ్లు పెట్టుకున్నారు. వారికి రావాల్సిన రూ.25లక్షల బిల్లులు రాకపోవడంతో బంగారం కుదవ పెట్టి పెండ్లి చేయాల్సిన పరిస్థితి వచ్చింది. నాగిరెడ్డిపల్లిలో మాజీ సర్పంచ్ భవాని ఇల్లు కుదవ పెట్టుకుంది. నియోజకవర్గంలో సగం మంది మహిళా ప్రజాప్రతినిధులు పేదలే. బిల్లుల కోసం సచివాలయానికి వెళ్లామని అనుకోగానే తెల్లవారు జామున 4గంటలకు మహిళా సర్పంచ్‌లు అని చూడకుండా పోలీసులు అరెస్టు చేశారు. కనీసం మహిళా పోలీసులు లేకుండా మహిళా ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం. రజాకారుల సమయంలో కూడా ఇంత నిర్బంధం జరగలేదు. సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే వాటిని పక్కన పెట్టి బిల్లులు చెల్లించకపోవడం విచారకరమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం

- నిధుల లేమితో పల్లెల్లో కుంటుపడిన అభివృద్ధి
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 16: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా పల్లెల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, సంక్షేమం ఊసేలేదని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిధులు లేక పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే రేవంత్ సర్కారు రైతులకు రూ.43 వేల కోట్ల పంట రుణమాఫీ చేయాల్సి ఉండగా, రూ.20 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నాదన్నారు. రైతుభరోసా రూ.7500 ఇస్తానని మాయమాటలు చెప్పి రైతన్నలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం అన్నదాతలను వంచించడమే పేర్కొన్నారు. మహిళలకు మహాలక్ష్మి, కల్యాణలక్ష్మి తులం బంగారం, వితంతువులు, వృద్ధుల పెన్షన్ రూ.4 వేలకు పెంపు అన్నీ ఉత్తుత్తి మాటలేనని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. కానీ ఏడాదిలో రూ.లక్ష కోట్ల అప్పు మాత్రం చేసిండు. ఆ నిధులు దేని కోసం ఖర్చు చేశారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటేనే స్కాంలు, స్కీంలు, అవినీతి అక్రమాలకు ఆనవాలుగా మారిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను గాలికొదిలేసి, సీఎం కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని ఎద్దేవా చేశారు.

ప్రభుత్వం సర్పంచ్‌లపై కక్ష కట్టింది

సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌లు

- సర్పంచ్‌ల బిల్లులపై ఎమ్మెల్యే హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నాం
- బిల్లులు చెల్లించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- సిద్దిపేట నియోజకవర్గ మాజీ సర్పంచ్‌లు

సిద్దిపేట, డిసెంబర్ 16: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదన్న భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వకపోవడంతోపాటు ఎన్నికలకు వెళ్లడం లేదని సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన మాజీ సర్పంచ్‌లు కాల్వ ఎల్లయ్య, ఉమేశ్‌చంద్ర, ఆంజనేయులు, పరశురాములు గౌడ్ అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సౌకర్యాలు మెరుగుపర్చి ఎంతో అభివృద్ధి చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న సర్పంచ్‌లకు బిల్లులు ఇస్తే వచ్చే ఎన్నికల్లో వారందరూ మళ్లీ పోటీ చేస్తే కాంగ్రెస్ గెలవడం కష్టమన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదన్నారు. అసెంబ్లీలో హరీశ్‌రావు సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం పొంతన లేని సమాధానం చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లపై కక్ష కట్టిందన్నారు. పెండింగ్ బిల్లులపై సర్పంచ్‌లు ఎలాంటి నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇవ్వకపోయినా అర్ధరాత్రి మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు మేమేందుకు ఇస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన సర్పంచ్‌లు బిల్లులు రాక ఇప్పుడు కూలీ పనులకు వెళ్లి వడ్డీలు కడుతున్నారన్నారు. మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల ఆవేదనను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు అజీజ్, నవీన్, రవీందర్ గౌడ్, భిక్షపతి నాయక్ పాల్గొన్నారు.

చేంజ్‌మేకర్స్ కాన్క్లేవ్‌కు హుస్నాబాద్ ఎంపిక

సమావేశ పత్రాన్ని రజితావెంకన్నకు అందజేస్తున్న మల్లికార్జున్ గౌడ్

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 16: స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తున్న హుస్నాబాద్ మున్సిపాలిటీ ఈనెల 19న ఢిల్లీలో జరగనున్న చేంజ్ మేకర్ కాన్క్లేవ్‌కు ఎంపికైనట్లు మున్సిపల్ చైర్పర్సన్ ఆకుల రజితావెంకన్న తెలిపారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హుస్నాబాద్ మున్సిపాలిటీ మరో అవార్డును సొంతం చేసుకుంటున్నదని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే జాతీయ, రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులను మున్సిపల్ సొంతం చేసుకున్నదని చైర్పర్సన్ చెప్పారు. హుస్నాబాద్‌ను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంఘాలు, పారిశుధ్య సిబ్బంది సహకారంతో కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో హుస్నాబాద్‌ను మరింత స్వచ్ఛ పట్టణంగా మార్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవార్డులు సైతం మరింత బాధ్యతను పెంపొందించాలన్నారు. ఈనెల 19న స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ డైరెక్టర్ రూపా ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి హుస్నాబాద్ మున్సిపాలిటీ నుంచి పర్యావరణ ఇంజినీర్ దయ్యాల రవికుమార్ హాజరవుతున్నట్లు చైర్పర్సన్ ఆకుల రజితావెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా మరో అవార్డు, ప్రశాంసాపత్రాన్ని అందజేయనున్నట్లు స్వచ్ఛ భారత్ మిషన్ అధికారులు సమాచారం అందజేశారని ఆమె తెలిపారు. దేశవ్యాప్తంగా 40 మున్సిపాలిటీలు, రాష్ట్రంలో 20 మున్సిపాలిటీలు ఎంపికయ్యాయని, అందులో హుస్నాబాద్ మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కిందని చైర్పర్సన్ సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, పర్యావరణ ఇంజినీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ సర్వే నెంబర్ 12లో కూల్చివేసిన వ్యర్థాలను తొలిగిస్తున్న హైడ్రా అధికారులు

హైడ్రా అత్యుత్సాహం

- అమీన్‌పూర్‌లో కూల్చేసిన ఇండ్ల వ్యర్థాల తొలిగింపు
- కేసు న్యాయస్థానంలో ఉండగా ఎలా తొలిగిస్తారంటున్న బాధితులు

అమీన్‌పూర్ డిసెంబర్ 16: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడ పరిధిలోని సర్వేనెంబర్ 12లో ఇటీవల హైడ్రా ఆధ్వర్యంలో కూల్చేసిన ఇండ్ల వ్యర్థాలను సోమవారం తెల్లవారుజామున హైడ్రా సిబ్బంది తొలిగించడం ప్రారంభించారు. హైడ్రా రాకతో అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల గుండెల్లో పరుగులు మొదలయ్యాయి. దీంతో మళ్లీ తమ ఇండ్లను ఎక్కడ కూల్చివేస్తారనే భయం కాలనీల్లో చర్చనీయంశమైంది. ఎట్టకేలకు బీఎస్సార్ కాలనీ ముందున్న 24 ఇండ్ల నిర్మాణాల వ్యర్థాలను తొలిగించి ఆ స్థలాలను ప్రభుత్వం ఆధీనం చేసుకుంటుందని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. ఈ కూల్చివేతల వివాదం న్యాయస్థానంలో ఉన్నప్పటికీ హైడ్రా అధికారులు అత్యుత్సాహంతో కోర్టు ఆదేశాలను బేఖాతరు చేసున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

చలితో వణుకుతున్న మెతుకుసీమ

ఉమ్మడి జిల్లాలో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- జహీరాబాద్ మండలంలోని సత్వార్‌లో 6.6 అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- బయటకు రావాలంటేనే జంకుతున్న జనాలు

చలి మంట కాచుకుంటున్న ప్రజలు

జహీరాబాద్, డిసెంబర్ 16: మెతుకుసీమ చలితో వణుకుతుంది. రోజురోజుకూ ఉమ్మడి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్ మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆయా మండలాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. జహీరాబాద్ మండలంలోని సత్వార్‌లో 6.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కోహీర్, న్యాల్‌కల్‌లో 6.7 జహీరాబాద్‌లో 6.9, కోహీర్‌లోని దిబ్బలో 7.0, జహీరాబాద్ మండలంలోని ఆల్గోలో 7.2, మల్చేల్మాలో 7.3, మొగుడంపల్లిలో 7.9, ఝరాసంగంలో 8.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, రాష్ట్రంలో సత్వార్ 8వ స్థానం, కోహీర్ పదో స్థానం, న్యాల్‌కల్ 12వ స్థానంలో నిలిచాయి. చలి తీవ్రతతో ఆయా మండలాలు, పట్టణ వాసులు ఉదయం వేళల్లో బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చలి తీవ్రతతోపాటు పొగమంచు దట్టంగా ఉంటే తెల్లవారు జాము ప్రయాణాలు పెట్టుకోవద్దని, అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే వాహనాలు జాగ్రత్తగా నడుపుకోవాలని సూచిస్తున్నారు. చలి నుంచి కాపాడుకునేందుకు వెచ్చటి దస్తులు ధరించాలని, స్వెటర్లు, మఫ్లర్లు వంటివి వాడాలంటున్నారు. చన్నీటి స్నానానికి దూరంగా ఉండాలని, శ్వాస వ్యవస్థ మీద ప్రభావం చూపించే పానియాలు, ఐస్‌క్రీమ్ వంటి వాటికి దూరంగా ఉంటే మంచిదంటున్నారు. వృద్ధులు, పిల్లలు, బాలింతలు, గర్భిణులు ఎక్కువగా ప్రభావితం అవుతారని, శ్వాసకోస సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రతగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంపైనే చలి ప్రభావం రోజురోజుకూ ఎక్కువగా అవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రాంతం సముద్ర మట్టానికి 640 మీటర్ల ఎత్తులో ఉండడం వల్ల చలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. నియోజవర్గంలోని న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల్లో మంజీరాతోపాటు నారింజ ప్రాజెక్టు, గోడిగార్‌పల్లి, ఈదులపల్లి, ఏడుకులపల్లి, చినిగేపల్లి, హద్నూర్, డప్పూర్ గ్రామాల శివారు ప్రాంతంలో చెరువులు, కుంటలు, బోరుబావులు ఉండడంతోపాటు పచ్చని చెట్లు, పంట పొలాల వల్ల చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. చలి తీవ్రత ఎక్కువ ఉండడం వల్ల యాసంగి సీజన్‌లో సాగు చేసే పంటలకు ఎంతో మేలు జరుగుతుందని న్యాల్‌కల్ మండలం బసంతపూర్ ప్రొఫెసర్ జయశంకర్ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పొగమంచు కురవడంతో కంది పూత రాలిపోయే ప్రమాదం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కప్పేసిన పొగమంచు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 16: చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఉదయం పొగమంచు కప్పేసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 7.30గంటలకు సైతం లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

వైద్యారోగ్యం, బయోటెక్నాలజీలో మరిన్ని పరిశోధనలు

- యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్
- ఐఐటీహెచ్‌లో ఇండోయూఎస్ వర్క్‌షాప్

సంగారెడ్డి, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ) వైద్యారోగ్యం, బయోటెక్నాలజీలో భారత్‌తో కలిసి అమెరికా మరిన్ని పరిశోధనలు జరపనున్నట్లు యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో సోమవారం 'వైద్యరంగంలో కృత్రిమమేధ వినియోగం' అంశంపై నిర్వహించిన ఇండో యూఎస్ సదస్సులో జెన్నిఫర్ లార్సన్ మాట్లాడారు. వైద్యారోగ్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగం ద్వారా విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగంతో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందటంతోపాటు ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి కాపాడేందుకు వీలు ఉంటుందని తెలిపారు. వైద్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగంపై అమెరికా పలు పరిశోధనలు జరుపుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం అమెరికా పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యరంగం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగం, బయోటెక్నాలజీ రంగానికి సంబంధించి ఆమెరికా-భారత్ కలిసి సంయుక్తంగా పరిశోధనలు జరుపుతున్నట్లు తెలిపారు. క్రిటికల్ డిసీస్ కంట్రోల్, పబ్లిక్‌హెల్త్, బయోటెక్నాలజీ రంగాల్లో యూఎస్-ఇండియా కలిసి పని చేస్తున్నట్లు చెప్పారు. సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించి యూఎస్‌కు భారత్ కీలకభాగస్వామిగా పేర్కొన్నారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎగుమతులు పెద్దఎత్తున జరుగుతున్నట్లు చెప్పారు. గతేడాది వీటి విలువ సుమారు రూ.40 బిలియన్ డాలర్లు ఉన్నట్లు తెలిపారు. సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ఏఐజీ దవాఖాన చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వినియోగం వల్ల రోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రధానంగా వ్యాధులను త్వరగా గుర్తించేందుకు వీలు చిక్కటంతోపాటు సత్వర వైద్యసేవలు అందించేందుకు వీలు ఉంటుందని తెలిపారు. ఐఐటీ హైదరాబాద్ ఈనెల 21, 22 తేదీల్లో ఐఐటీహెచ్‌లో ఉత్తమ ఆవిష్కరణలు చేపట్టిన విద్యార్థులకు విశ్వకర్మ అవార్డులను ప్రదానం చేయనున్నారు. అవార్డుల కార్యక్రమానికి బెయిన్ క్యాంపిటల్ ఇండియా చైర్మన్ అమిత్ చంద్ర, హెచ్‌సీఎల్ వ్యవస్థాపక సభ్యులు అజయ్ చౌదరి హాజరుకానున్నారు.

కాంగ్రెస్ పాలనలో కరెంటోళ్ల ఆగడాలు

కరెంట్ బిల్లు కట్టలేదని విద్యుత్ సరఫరా నిలిపివేత

- 120 యూనిట్లు వాడినా గృహజ్యోతి వర్తించని వైనం
- 30 ఏండ్లుగా కాంగ్రెస్‌కు సేవలు
- వీడియోలో సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం లింగాపూర్ రైతు చెన్నారెడ్డి ఆవేదన
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో

చెన్నారెడ్డి ఇంటికి కరెంటు కట్ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

గోడు వెల్లబోసుకుంటున్న చెన్నారెడ్డి, అతడి భార్య కరుణ

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 16: నిరుపేద రైతు కుటుంబంపై విద్యుత్ శాఖ అధికారులు ప్రతాపాన్ని చూపించారు. కరెంట్ బిల్లు కట్టడం లేదని ఆ ఇంటికి ఏకంగా కరెంట్ సరఫరా నిలిపివేయడంతో ఆ కుటుంబం రాత్రంతా చీకట్లోనే గడపాల్సిన దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే..సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన రైతు కూరెల్ల చెన్నారెడ్డి తనకున్న నాలుగున్నర ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ లారీ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. చెన్నారెడ్డి ప్రతినెలా ఇంట్లో సుమారు 120 యూనిట్ల విద్యుత్‌ను మాత్రమే వినియోగిస్తున్నాడు. అయితే 200 యూనిట్లలోపు వినియోగదారులకు గృహజ్యోతి కింద ఉచిత కరెంట్ అందిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ చెన్నారెడ్డికి మాత్రం గృహజ్యోతి అమలు కావడం లేదు. ప్రజాపాలనలో గృహజ్యోతి కింద దరఖాస్తు చేసుకున్నప్పటికీ దరఖాస్తు చేసుకోలేదని ఆన్‌లైన్ చూపిస్తుండడంతో చెన్నారెడ్డిని ప్రభుత్వం గృహజ్యోతికి అనర్హుడని చేసింది. గృహజ్యోతి కోసం మద్దూరు ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో కరెంట్ బిల్లు కట్టడం లేదని విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో రైతు తన బాధను ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో తన ఆవేదనను సెల్‌ఫోన్‌తో వీడియో తీసి స్థానిక వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టు చేశారు. ప్రస్తుతం ఆ వీడియో వైరల్‌గా మారింది.

వీడియోలో చెన్నారెడ్డి ఆవేదన.. ఆయన మాటల్లోనే..!

చూడండి మిత్రులారా.. ఇగో కరెంటోళ్ల ఆగడాలు. మన కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత ఏం పరిస్థితి జరుగుతుందో..ప్రత్యక్షంగా చూడండి. ఇగో ఇది నా ఇంటి సమస్యనే..బిల్లు కట్టలేదని కరెంట్ కట్ చేసుకపోతుండ్రు. వీలందరూ కలిసి అసలు కాంగ్రెస్ గర్నమెంట్ ఇచ్చిన పథకాల్లో కరెంట్ బిల్లు మాఫీ అని చెప్పిండ్రు..పంట రుణమాఫీ అని చెప్పిండ్రు. రైతుబంధు లేదు, రుణమాఫీ లేదు, కరెంటోళ్లు కూడా కరెంట్ కట్ చేసుకపోయే పరిస్థితులు ఏర్పడుతున్నయి.. బిల్లు కట్టలేదని. మాకు వచ్చేది 120, 130 యూనిట్ల కంటే ఎక్కువ లేదు. ఈ కాంగ్రెస్ గవర్నమెంట్‌లో 120 యూనిట్లు వచ్చిన కూడా మాకు కరెంట్ బిల్లు మాఫీ కావడం లేదు. ఎంపీడీవో ఆఫీసు చుట్టూ తిరిగినా కరెంట్ బిల్లు మాఫీ అవుతలేదని చెప్పులరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. ఇయ్యాల కరెంటోళ్లు వచ్చి కరెంట్ కట్ చేసుకపోతుండ్రు.. అసలు కాంగ్రెస్ గవర్నమెంట్ చేసేటువంటి పరిస్థితి ఇది ఉన్నది. 30 సంవత్సరాలుగా కాంగ్రెస్‌కు సేవలందిస్తున్నా... పట్టించుకున్న నాథుడే లేడు. ఏ పరిస్థితిలో కూడా ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదిక్కడ. మాకున్న జడ్పీటీసీ గానీ, మా నియోజకవర్గ ఇన్‌చార్జి గానీ మా రైతుల బాధలను పట్టించుకునే పరిస్థితులే లేకుండా పోయినయి. నేను ఇంటిదగ్గర లేని పరిస్థితి చూసి కరెంటోళ్లు కరెంట్‌ను కట్ చేశారు.. అసలు ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ బాధ్యతార హితంగా ప్రవర్తిస్తుంది. అని చెన్నారెడ్డి వీడియోలో తన గోడును వెల్లబోసుకున్నాడు. ఈ విషయమై ధూళిమిట్ట ట్రాన్స్‌కో ఏఈ కె.రాజును 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో వివరణ కోరగా.. చెన్నారెడ్డి ఏడాది కాలంగా ఇంటి కరెంట్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ సిబ్బంది కనెక్షన్ కట్ చేసినట్లు తెలిపారు. బిల్లు చెల్లిస్తే పునరుద్ధరిస్తామన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 16: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ అర్జీదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో 58 ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ తన చాంబర్‌లోనూ, సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్వో పద్మజారాణి అర్జీలను స్వీకరించారు. అర్జీలు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్- 2 రాస్తూ.. ఫిట్స్‌తో పడిపోయి..

- చికిత్స కోసం పటాన్‌చెరు దవాఖానకు తరలింపు
- గుండెపోటు అని తేల్చిన వైద్యులు

పటాన్‌చెరు, డిసెంబర్ 16: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాలలో గ్రూప్-2 పరీక్ష రాస్తూ నగేశ్ అనే అభ్యర్థి ఫిట్స్‌తో పడిపోయాడు. తక్షణం స్పందించిన అధికారులు అతడిని చికిత్స కోసం స్థానిక దవాఖానకు పంపించారు. వివరాల్లోకి వెళితే... పుల్కల్ మండలం లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన నగేశ్ సోమవారం పటాన్‌చెరు డిగ్రీ కళాశాలలో గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రాస్తూ ఫిట్స్‌తో సృహతప్పి పడిపోయాడు. వెంటనే స్పందించిన పరీక్ష సిబ్బంది పోలీసులకు తెలపడంతో ఎస్ఐ ఆసీఫ్ అలీ అభ్యర్థిని మొదటి అంతస్తు నుంచి కిందికి దించి పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించి చికిత్స చేశారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటు వచ్చిందని తేల్చారు. దీంతో అభ్యర్థి కుటుంబ సభ్యులు నగేశ్‌కు మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డిలోని ఓ ప్రేటు దవాఖానకు తరలించారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న నగేశ్